

భారీ వాహనాలకు జరిమానా



వాహనాలు తనిఖీ చేస్తున్న హాజీపూర్ ఎస్ఐ

హాజీపూర్, మే22 (ఆంధ్రజ్యోతి): హాజీపూర్ పోలీసుల ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎన్‌హెచ్ 63 జాతీయ రహదారిపైన నిలిపి ఉంచిన భారీ వాహనాలకు జరిమాన విధించి డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డుపైన ఎటువంటి వాహనాలు నిలుపరాదని అలా చేయడం వల్ల వెనుకాల వచ్చే వాహనాలకు ప్రయాణిస్తున్నట్లు భావన కలిగి వెనుక నుంచి ఢీకొట్టి రోడ్డు ప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని హాజీపూర్ ఎస్ఐ స్వరూప్‌రాజ్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు ఆపాల్సి వస్తే ఖచ్చితంగా పార్కింగ్‌లైట్లు, రెడ్ ట్రియాంగిల్‌తోపాటు డ్రైవర్, క్లీనర్లు వాహనం ముందు, వెనుకాల నిలబడి చేతి ద్వారా సిగ్నల్ చేస్తూ ఉండాలని డ్రైవర్లకు సూచించారు.

సోలార్ ఫెన్సింగ్ సామగ్రి చోరీ

నెన్నెల, మే22 (ఆంధ్రజ్యోతి): గొళ్లపల్లి గ్రామరైతు సరెండ్ల భూమయ్యకు చెందిన సోలార్‌ప్లేట్లు, బ్యాటరీలను బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. మూడుఎకరాల పంటకు రక్షణగా సోలార్ కంచె ఏర్పాటు చేసుకోగా చోరీ జరిగిందన్నారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.



కొత్త పింఛన్లు ఎప్పుడో..?

ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా...

- ఏడాదిన్నర గడిచినా ముందుకు కదలని ప్రక్రియ
- జిల్లాలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు
- ఓఏపీ మినహా ఇతర పింఛన్లకు కలగని మోక్షం
- మరికొన్ని పథకాలదీ అదే దారి

మంచిర్యాల, మే 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా కొత్త పింఛన్లు మంజూరుకు మోక్షం కలగడం లేదు. ఏడాదిన్నర గడిచినా ఆ ప్రక్రియ అక్కడే ఆగిపోయింది. చేయూత పథకం కింద పింఛన్లను పెంచబోతున్నట్లు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. 2024 జూలైలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, మహిళా శిశుసంక్షేమ శాఖలపై మంత్రి నిర్వహించిన సమీక్షలో పై విధంగా ప్రకటన చేశారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్ల జారీకి అర్హుల జాబితాను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. అంతా సవ్యంగా సాగితే అదే సంవత్సరం ఆగస్టు 1నుంచే కొత్తపింఛన్లు అందుతాయనే ప్రచారం జరగడంతో దరఖాస్తుదారులు ఆశపడ్డారు. అయితే నేటి వరకు ఆ ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు.

దరఖాస్తుల పరిశీలన పూర్తయినా....

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా వివిధ సంక్షేమ పథకాల కోసం అర్హులైన పేద ప్రజల నుంచి దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి రోజుల్లోనే ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. చేయూత పథకం అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండటంతో ఆయా విభాగాలకు చెందిన దరఖాస్తుల పరిశీలనను కూడా అధికారులు పూర్తి చేశారు. జాబితాను కంప్యూటరైజ్ చేసిన అనంతరం అర్హుల..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత వివిధరకాల పథకాలకోసం స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగానే పింఛన్‌దారుల నివేదికను అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. ఆయా దరఖాస్తులతోపాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పెండింగులో ఉన్న పింఛన్ల లిస్టును కూడా పరిగణలోనికి తీసుకున్న అధికారులు అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ప్రస్తుతం చేనేత, ఫైలేరియా రోగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ఎయిడ్స్ రోగులు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్రంలో పింఛన్లు అందజేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆసరా పథకం కింద రూ. 2016, దివ్యాంగులకు రూ. 3016 ఇవ్వగా, కాంగ్రెస్ హయాంలో చేయూత పథకం ద్వారా వాటిని రూ. 4 వేలకు పెంచుతున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది.

(తరువాయి 7లో)

ధాన్యాన్ని మిల్లులకు త్వరగా తరలించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



సారంగపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మందమర్రిరూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని రైసుమిల్లులకు త్వరగా తరలించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బొక్కలగుట్ట, సారంగపల్లి గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలు ఉన్నందున త్వరగా ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించాలన్నారు. సన్నరకం వడ్లను విక్రయించిన రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మంచినీరు, నీడ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టార్పాలిన్‌లు, గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. కొనుగోలు కేంద్రాలు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఆదివారంలోగా సారంగపల్లి కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని మొత్తం తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి

సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్



బస్టాండ్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సీపీఐఎంఎల్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మే22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే ఆపాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బస్టాండ్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బూటకపు ఎన్‌కౌంటర్‌ను సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతిచర్చలు జరుపాలన్నారు. 2026 నాటి కల్ల మావోయిస్టు పార్టీని లేకుండా చేయాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం నరమేధానికి పాల్పడుతుందని విమర్శించారు. బూటకపు ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు మృతి చెందడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా సంకె రవి, లాల్‌కుమార్, బ్రహ్మానందం, అందె మంగ, జాడి దేవరాజ్, గంట సత్యం, ప్రకాశ్, దేవి సత్యం, మేకల రామన్నలు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలక్రైం, మే22(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సప్లమెంటరీ పరీక్షలో 506 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 483 మంది హాజరయ్యారు. 23 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం మొత్తం 1509 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1424 మంది హాజరయ్యారు. 85 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య తెలిపారు.

మావోయిస్టులతో శాంతియుత చర్చలు జరపాలి

మంచిర్యాలక్రైం, మే22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో శాంతి చర్చలు జరుపాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జైపాల్‌సింగ్ అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణఫూర్ లోని అడవుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత నంబాల కేశవరావు తోపాటు 27 మంది మావోయిస్టులను కేంద్ర బలగాలు కాల్చిచంపడాన్ని ఆయన తీవ్ర ఖండించారు. ఆయుధాలు వీడి సమస్యను పరిష్కరిద్దాం అంటూ ఎన్నిసార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా లేఖలు రాసిన కేంద్రప్రభుత్వం నక్సలైట్లతో పాటు గిరిజనులను కాల్చిచంపే నరహంతక చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపద దోచేందుకు ఈ కగార్ ఆపరేష్ చేపట్టిందని విమర్శించారు. ఇప్పటికైన శాంతి చర్చలు జరిపి మారణకాండను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్యకిరణ్ పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి చేసిన వ్యక్తి భాగ్యరెడ్డి వర్మ

- కలెక్టర్ కుమార్ దీపక్



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, మే22 (ఆంధ్రజ్యోతి): దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకొని ఎస్సీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డీడీ రవీందర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, అధికారులతో కలిసి భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అనగారిన వర్గాల శ్రేయస్సుకోసం కృషి చేశారన్నారు. బాల్య వివాహాలు, అంటరానితనం, దేవదాసి, జోగిని వ్యవస్థలను రూపు మాపేందుకు పోరాటం చేశారని కొనియాడారు. దళిత ఉద్యమ పితా మహుడిగా, సంఘ సంస్కకర్తగా భాగ్యరెడ్డి ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచారని, సమాజంలో దళితుల చైతన్యం కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. మహనుభావుల జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారంగా నిర్వహించడం సంతోషకరమని, మహనీయుల చరిత్ర, త్యాగాలను బావి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని, దేశ భవిష్యత్తు, ప్రజల సంక్షేమం కోసం మహనీయులు ఆచరించిన మార్గాలను బావితరాలకు అందిస్తూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సంతోష్‌కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝూ

మంచిర్యాలక్రైం: సంఘ సంస్కర్త ఎంవీ భాగ్యరెడ్డి వర్మ సంస్కరణలు, సేవలు చిరస్మరణీయమని రామగుండం సీపీ అంబర్‌కిషోర్ ఝూ అన్నారు. భాగ్యరెడ్డివర్మ జయంతి సందర్భంగా సీపీ కార్యాలయంలో నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సంస్కరణకు చేసిన కృషి మరువలేనిదన్నారు. అనేక పోరాటాలు చేశారని, ఆంధ్రసభ స్థాపకుడిగా, హైదరాబాద్‌లో దళిత పాఠశాలను స్థాపించి దళితుల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్‌రాజు, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్‌ఏసీపీ ప్రతాప్, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

మంచిర్యాల కలెక్టరేట్, మే22(ఆంధ్రజ్యోతి): గాయత్రి బ్యాంక్ మంచిర్యాలశాఖ ఖాతాదారుడైన పొలిశెట్టి బాలస్వామి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడికి దిగాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో గాయత్రి నిర్భయ సేవింగ్‌ఖాతాపై ప్రమాదబీమా సౌకర్యం ద్వారా అతని భార్య పొలిశెట్టి జ్యోతికి రూ.1లక్ష చెక్కును మున్సిపల్ కమిషనర్ తౌటం శివాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కేలేటి ప్రవీణ్, జూనియర్ ఆఫీసర్స్ రేగటి రమేష్, ఎల్లందుల శివ కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పెంపొందించుకోవాలి



ప్రవచనాలు బోధిస్తున్న చినజీయర్ స్వామి

మందమర్రిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరు ఆధ్యాత్మికతను దైవ భక్తిని పెంపొందించుకోవాలని చిన్నజీయర్ స్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ రథోత్సవ ముగింపు వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలో భక్తులనుద్దేశించి ప్రవచనాలు బోధించారు. ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలతో మందమర్రిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందన్నారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారన్నారు. హిందూ ధర్మాలను ఆచరించడం మంచిదన్నారు. 25 సంవత్సరాల క్రితం పంచముఖాలతో సృష్టించిన ఆంజనేయ స్వామిపై భక్తులకు అపార నమ్మకం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని, శాంతి, కరుణ, ప్రేమ చూపాలన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతాచార్యులు, కృష్ణకాంతాచార్యులు, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలి

- పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ



నెన్నెల పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న డీసీపీ భాస్కర్

నెన్నెల, మే 22 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని డీసీపీ భాస్కర్ సిబ్బందికి సూచించారు. నెన్నెల పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణ, పరిరాలను పరిశీలించారు. క్రైం రేట్, కేసుల నమోదు, నేరస్థుల వివరాలను స్థానిక ఎస్సై ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి డీసీపీ సలహాలు, సూచనలిచ్చారు. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకొని పోలీసులు గ్రామీణ ప్రజలకు దగ్గర కావాలన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి మన్ననలు పొందాలన్నారు. నేరాల అదుపు కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. అయతనో బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ ఉన్నారు.



కోటపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై ఉంచిన కవర్లపై నిలిచిన నీరు



జైపూర్ మండలంలో సాగర్‌రావు కాంప్లెక్స్ వద్ద ఉన్న కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

- ఆందోళనలో రైతులు ● తడిసిన ధాన్యం

వెంటాడుతున్న వర్షాలు

కాసిపేట, మే22(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో మూడురోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడం రైతులకు శాపంగా మారింది. మల్కపల్లి కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబోసిన రైతులకు వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో ఆరుగాల కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద తడిసి ముద్దవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తడిసిన దన్యాన్నిప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

వరిధాన్యం పందుల పాలు

జైపూర్ : ఆరుగాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవస్తే ఒక వైపు వర్షం మరో వైపు పందుల బెడదతో భయపడాల్సి వస్తుంది. మండల కేంద్రంలోని సాగర్‌రావు కాంప్లెక్స్ వద్ద డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం పందుల పాలైంది. పెగడపల్లి గ్రామానికి చెందిన మామిడాల రాజేందర్ గౌడ్ రెండు ఎకరాల వరి పంట వేయగా అందులో నీటి తడి అందక ట్రాక్టర్ లోడ్ వచ్చాయని, ఈ వడ్లను కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే పందులు ధాన్యాన్ని తిని అంగడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశాడు. కలెక్టర్ స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.



మల్కపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం కుప్పలు

కోటపల్లి : మండలంలో అకాల వర్షం కురవడంతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వర్షానికి తడిసి ముద్ద అయ్యింది. ధాన్యం అంతా తడిసి ముద్ద అవడంతో పాటు కొంత మేర కొట్టుకుపోయింది. మండల కేంద్రంతో పాటు శెట్‌పల్లి, దేవులవాడ తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని దేవులవాడ గ్రామంలో అత్యధికంగా 49.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఓ వైపు ఆరబోస్తుండగానే గురువారం మధ్యాహ్నం మరోసారి తేలికపాటి వర్షం పడడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

దండేపల్లి: దండేపల్లి మండలంలోని బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు మండలంలోని కోర్విచెల్మ గ్రామంలో ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వాటిలో కొన్నింటివి ఇంటి పైకప్పులు తెచ్చిపోగా, మరికొన్నింటివి గోడలు డ్యామేజ్ అయ్యాయి. దెబ్బతిన్న ఇళ్లను రెవెన్యూ సిబ్బంది పరిశీలించిన తర్వాత నష్టాన్ని అంచనా వేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విజయ తెలిపారు. బుధవారం సాయంత్రం కూడా ఈదురు గాళ్లతో వర్షం పడటంతో పెంకుటిల్లు గోడలు కూలిపోయ్యాయి.

జన్నారంలో భారీ వర్షం

జన్నారం: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు అల్లాడి పోతున్నారు. బుధవారం రాత్రి తెలంగాణలోనే అత్యధికంగా జన్నారం మండలంలోని తపాల్‌పూర్ గ్రామంలో 97.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు వాతావరణశాఖ తెలిపింది. గురువారం సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి హెచ్చరించారు. రాత్రిపూట ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాళాలతో పాటు బయటకు వెళ్లే ప్రజలకు సూచన చేశారు.

నస్పూర్: పట్టణంలో గురువారం వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు కురిసిన వర్షం 4మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

భీమారం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల తో రైతులు ఆందోళన చెందుతున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని రైతులు కాపాడుకునేందుకు నానా తండాలు పడుతున్నారు. గన్నీ సంచుల్లో నింపిన బస్తాలను లారీల్లో ఎక్కించేందుకు హమాలీల కొరత ఉండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉంటుంది. దీంతో వర్షానికి తడిసిపో తుంది. ఏసంగి వరి కోతలు ఇంకా 20శాతం మిగిలి ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

తాండూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని రైతులకు శుక్రవారం ఉదయం 7 గంటలకు నకిలీ విత్తనాల నివారణపై పోలీసు, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తామని ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తాండూర్ వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి ఐబీ అండర్ బ్రిడ్జి వరకు అవగాహన ర్యాలీ ఉంటుందన్నారు. మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కోనప్పకు సోలార్ కంచె తగిలి షాక్

కౌటాల, మే 22 (ఆంధ్రజ్యోతి): సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు గురువారం రాత్రి సోలార్ కంచె తగిలి షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల నుంచి సిర్పూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ముత్తంపేట వద్ద వర్షానికి వడ్లు తడిసి ఉండటంతో కోనప్ప రైతులతో మాట్లాడేందుకు కారు దిగి వడ్ల కల్లాల వైపు వెళ్లారు. రోడ్డు పక్కనే సోలార్ కంచె పెట్టి ఉండటం, వైరు తగలటంతో షాక్‌కు గురయ్యారు. దీంతో అక్కడే ఉన్న వ్యక్తిగత సిబ్బంది వెళ్లి కోనేరు కోనప్పను సమీప కారులోకి తీసుకొచ్చారు. కాసేపు తర్వాత కోలుకోవడంతో కాగజ్‌నగర్‌కు బయలుదేరి వెళ్లారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


శ్రీలత (ఫైల్)

లక్షెట్టిపేట, మే 22(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని మోదెలకు చెందిన ఎలగతి శ్రీలత(29) అనే వివాహిత కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీలతకు మోదెల గ్రామానికి చెందిన సురేష్‌తో వివాహం కాగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. కూతురు ఆద్యశ్రీకి చిన్నతనం నుంచి ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆసుపత్రుల్లో చూపించి మందులు వాడుతున్నా నయం కావడంలేదు. దీంతో శ్రీలత కొద్దిరోజులు వేరే కాపురం పెట్టాలని నిర్ణయం తీసుకుంది. తన భర్తతో తరచూ స్థానచలనం చేద్దామని బాధలు తొలుగుతాయని చెప్పడంతో తాను సరే అన్నాడు. కానీ వేరు కాపురం పెట్టడం కొద్దిగా ఆలస్యం కావడంతో మనస్తాపం చెంది ఈనెల 19వ తేదీన రాత్రి గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి సందెల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైన్స్‌లో చోరీ

నస్పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద గల ఏఎస్ఆర్ వైన్స్‌లో బుధవారం అర్ధరాత్రి చవోరీ జరిగింది. షెట్టర్ తాళం పగుల గొట్టి నిందితులు లోపలకు వెళ్లారు. గురువారం ఉదయం షాపునకు వచ్చి చూసే సరికి తాళం పగులగొట్టి ఉండడం గమనించిన నిర్వాహకులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు వచ్చి పరిశీలించారు. కౌంటర్‌లో ఉన్న సుమారు 12 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. లోపల ఉన్న సీసీ కెమెరాను పగులగొట్టినట్లు షాపు నిర్వాహకులు తెలిపారు. ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఇజాజ్ తెలిపారు.

గుండెపోటుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతి

జైనూర్, మే22,(ఆంధ్రజ్యోతి): స్థానిక సీడీపీవో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత(48) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. సుజాత ఆసిఫాబాద్ నుంచి బస్సులో జైనూరు వైపు వస్తుండగా కెరమెరిలో గుండెపోటు వచ్చిందని బంధువులు తెలిపారు. అక్కడి నుంచి నేరుగా ఉట్నూరుకు తీసుకెళ్లి సివిల్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందారని తెలిపారు. మృతురాలు సుజాత ఉట్నూరు మండలంలోని గోదరి గూడకు చెందింది. ఆమెకు కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అర్హులకే 'రాజీవ్ యువ వికాసం' ఫలాలు

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అర్హులకే అందిస్తామని కుమరం భీం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. గురువారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో, షెడ్యూల్ కులాల సహకార సంస్థ ఈడీ లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రాజేశ్వరి జోషిలతో కలిసి రాజీవ్ యువ వికాసం పథకం సంబంధిత వెరిఫికేషన్, బ్యాంకు సిబిల్ స్కోర్ పరిశీలన ప్రక్రియను సమీక్షించారు. అభ్యర్థుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. అభ్యర్థుల సిబిల్ స్కోర్ పరిశీలనలో బ్యాంకర్లు నిబంధనలను పాటించాలని తెలిపారు. అనంతరం మండలంలోని ఉగండి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, ఎంపీడీవో, మండల స్థాయి అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలగానే సమీకృత మార్కెట్


రోడ్డుపైనే గొడుగులు పట్టుకొని కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- చిరువ్యాపారుల తంటాలు
- ఆది నుంచి అన్నీ అవాంతరాలే..

కాగజ్‌నగర్ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఐదేళ్లుగా సమీకృత మార్కెట్ కల నెరవేరడం లేదు. సమీకృత మార్కెట్ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ ఇంకా నిర్మాణానికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి నిధులు మూలు గుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించు కోకపోవడంతో కల నెరవేరడం లేదు. గత 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాగజ్‌గనర్ మున్సిపాలిటీకి 5.2లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే అప్పటి పాలకవర్గం ఆధ్వర్యంలో అధికారులు స్థల సేకరణ కోసం అనేక స్థలాలను పరిశీలించారు. కాగజ్‌నగర్‌లోని బారెగూడ శివారులోని స్థలాన్ని పరిశీలించి భూమి పూజ చేపట్టారు. తదనంతరం పలు కారణాలతో అక్కడి నుంచి ఏదైనా వేరే చోటికి తరలించి నిర్మాణం కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం తిరిగి కొన్నేళ్లుగా ఉలుకుపలుకు లేకుండానే గడిచింది.

● మురిగిపోయిన నిధులు..

పూలు, పండ్లు, తాజా కూరగాయలు ఒకే చోట విక్రయించడంతో పాటు మరోవైపు మాంసం, చికెన్, చేపలు, తదితర నాన్‌వెజ్‌ల విక్రయాలకు ప్రత్యేక ఏర్పాట్లు వీటిలో ఉంటాయి. తద్వారా పేదలకు ఉపాధి అవకాశాలతో పాటు వినియోగదారులకు సౌలభ్యంగా ఉంటుందన్న ఉద్దేశంతో సమీకృత మార్కెట్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అట్టహాసంగా శంకుస్థాపన చేసినప్పటికీ నేటికి అది పూర్తికాలేదు. పైగా అన్ని అవాంతరాలే ఎదురవుతున్నాయి. కాగజ్‌నగర్‌తో పాటు నియోజకవర్గం, మండలంలోని అనేక గ్రామాల నుంచి వ్యాపారులు కాగజ్‌నగర్ వస్తుంటారు. దీంతో చిరు వ్యాపారులు కూరగాయలను ఎండలో ఎండుతూ వానలో తడుస్తూనే విక్రయాలు జరుపుకోవాల్సి వస్తోంది. ఈలోగా ఎన్నికలు రావడంతో నిధులు మురిగి పోయాయి. ఇదే అవకాశంగా భావించిన అధికారులు నిధులు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు సైతం వచ్చాయి. కోట్లాది రూపాయల నిధులు విడుదల అయినప్పటికీ నిర్మాణాలు మాత్రం పూర్తి కాలేదు. ఈ నిర్మాణాలు పూర్తయితే కాగజ్‌నగర్‌లో కూరగాయలు, మాంసం, చేపలు, ఇతరత్ర పూర్తి స్థాయిమార్కెట్ అన్ని హంగులతో ఏర్పడేది. కానీ పనులు కొనసాగకపోవడంతో పెండింగ్‌లో ఉండిపోయింది.

● కాంట్రాక్టర్ మృతి చెందడంతో ..

మార్కెట్ నిర్మాణంకోసం స్థలం సేకరించే విషయంలో అప్పటి పాలకవర్గం సైతం ఆర్అండ్‌బీ, ఈఎస్ఐ భూమితో పాటు పలు స్థలాలను పరిశీలించింది. ఆఖరుకు ఆర్అండ్‌బీ భూమిలో నిర్మించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ పురాతనమైనదని ఈ స్థలంలో నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసు కున్నారు. గెస్ట్‌హౌస్ కూల్చివేస్తే ఆస్థలం అనుకూలంగా ఉంటుందని లేఖరాయడంతో అనుమతి కూడా వచ్చింది. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తిరిగి నిర్మాణ పనులు చేయాలని అధికారులు భావించారు. కానీ టెండరు పొందిన కాంట్రాక్టర్ మృతి చెందడంతో పనులు మొదలు కాలేదు. దీంతో మరింత కాలయా పన జరిగింది. టెండరుదారు సంబంధీకులు తాము పనులు చేయలేమని లిఖితపూర్వకంగా మున్సిపల్ అధికారులకు ఇవ్వడంతో మళ్లీ మొదటికి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడిచినా నేటికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌నిర్మాణం కలగానే మిగిలిపోయింది.

గంజాయి నివారణకు ప్రత్యేక చర్యలు

● ఎస్సై మధుకర్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : యువత కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఎస్సై : గ్రామీణ ప్రాంత యువత కోసం కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా నేరాల వైపు ఆకర్షితులు కాకుండా మంచి భవిష్యత్‌కోసం ముందుకు సాగా లని సూచిస్తున్నాం. పలు గ్రామాల్లో వాలీ బాల్ కిట్లు పంపిణీ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : సైబర్ క్రైమ్‌పై ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

ఎస్సై : సైబర్ క్రైమ్‌కి సంబంధించి 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని సూచిస్తున్నాం. బ్యాంకు అకౌంట్‌కు సంబం ధించి వివరాలు అపరిచితులు ఫోన్ చేసి అడిగితే చెప్పరాదు. అలాగే వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వాటిల్లో వివరా లను గోప్యంగా ఉంచాలి.

ఆంధ్రజ్యోతి : మద్యం సేవించి వాహ నాలు నడిపితే ఎలాంటి చర్యలు తీసు కుంటున్నారు?

ఎస్సై : మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అలాగే 18సంవత్సరాల లోపు పిల్లలు వాహ నాలు నడిపితే వారి తండ్రిపై కేసు నమో దు చేస్తాం.

ఆంధ్రజ్యోతి : గంజాయి, పేకాట నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఎస్సై : గంజాయి, డ్రగ్స్ నివారణ కోసం గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం. వాటి నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో ఎవరైనా గంజాయి, పేకాట, డ్రగ్స్ లాంటి కార్యక్రమాలు చేపడితే పోలీసులకు, డయల్ 100కు సమాచారం అందించాలి.

- కెరమెరి(ఆంధ్రజ్యోతి):

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చింతలమానేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి గ్రామం అటవీ సమీపంలో గల ఓ మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సిర్పూర్(టి) మండలానికి చెందిన పురుశెట్టి నరేష్, సోనీ దంపతులు బైక్‌పై మహారాష్ట్రకు వెళ్తున్నారు. ఈక్రమంలో బైక్ అదుపు తప్పి మూల మలుపు వద్ద కింద పడడంతో నరేష్, సోనీలకు గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న స్థానికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి తరలించారు. కాగా నరేష్ మద్యం మత్తులో ఉండడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

జైనూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జైనూరు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం గ్రామకార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పైలెట్ గ్రామపంచాయతీల్లో ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధిహామీలో భాగంగా రైతులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలన్నారు. అర్‌డబ్ల్యూఎస్ ఏఈ రంజిత్, ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

దండేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేటకు చెందిన గొల్ల తిరుపతి అనే రైతుకు చెందిన పాడి ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గురువారం ఉదయం గ్రామ సమీపంలో మేత కోసం వచ్చిన ఆవు ఇనుప విద్యుత్ స్తంభానికి తగలడంతో మృత్యువాత పడింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అక్కడికి రాగా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరారు. ఆవు విలువ 50 వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితరైతు తిరుపతి కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి టెలి కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో అకాల వర్షాలు, ధాన్యం కొనుగోలు, వానాకాలం సీజన్ సన్నద్ధం అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అకాల వర్షాలు ఇంకా రెండుమూడు రోజులు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన విత్తనాలు, యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసి టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతామన్నారు. తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీపీఓ భిక్షపతి, జిల్లా పౌ సరఫరాల శాఖాధికారి వినోద్, స్వామి, మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఆసిఫాబాద్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): పేదవారికి వైద్య సౌకర్యం కోసం అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆమె నివాసంలో 40 మంది లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ధృపతాబాయి, రవీందర్, శంకరమ్మ, శ్రీధర్, ఆనంద్, అఫ్రోజ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

త్వరలో అందుబాటులోకి ఔషధాలు

శ్రీరాంపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆస్పత్రులు, డిస్పెన్సరీలలో త్వరలో ఔషధాలు అందుబాటులోకి వస్తాయని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక సమస్యతో రెండు నెలల నుంచి ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు అందుబాటులో లేవని పేర్కొన్నారు. వారి ఇబ్బందులను ఏఐటీయూసీ వెంటనే గుర్తించి యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లిందన్నారు. సీఎండీ స్పందించి సోమవారం నుంచి ఔషధాలు అందుబాటులోకి వచ్చేలా అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, మే 22 (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వీటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గురువారం ఎస్‌వోఎం శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ పేరం శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ డిప్యూటీ జనరల్ కార్యదర్శి ప్రకాష్‌రావు మాట్లాడుతూ నూతన బదిలీ సర్క్యులర్ వెంటనే రద్దు చేయాలని కోరారు. ఖైరిగూడ కార్మికులకు డ్యూటీకి రావటానికి ఇబ్బందులకు గురవుతున్నారని, గతంలో మూడు బస్సులు ఉంటే ఇప్పుడు రెండు బస్సులే వస్తున్నట్లు తెలిపారు. ఈపీ ఆపరేటర్ ప్రమోషన్‌పై ఎలాంటి ఆంక్షలు లేకుండా కాలపరిమితి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు మాధవకృష్ణ, మాసడి నారాయణ, గంగుల రాంమోమన్, బోయిన రాజేశం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధజల కేంద్రానికి భూమి పూజ

రెబ్బెన, మే 22 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం గోలేటిలో సీఎస్ఆర్ నిధులతో నిర్మించనున్న శుద్ధ జల కేంద్ర నిర్మాణానికి జనరల్ మేనేజర్ ఎం విజయభాస్కర్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, డీజీఎం(సివిల్) ఎస్‌కె మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఈఈ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

శ్రీరాంపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ ఆదేశించారు. జూన్ 2వ తేదీన నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై గురువారం ఆయన అధికారులపై సమీక్ష నిర్వహించారు. వేడుకలకు హాజరయ్యే ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్‌కే 5, 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, డీజీఎంలు అరవిందరావు, ఆనంద్‌కుమర్, రవీందర్, వీటీసీ మేనేజర్ వెంకటరామారావు, సీనియర్ పీవో కాంతారావు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జీఎం

కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తాం

కాలనీవాసుల సమస్యలు పరిష్కరిస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయం, ఆర్‌కే 5 కాలనీలోని స్విమ్మింగ్ పూల్, కృష్ణకాలనీలోని శాంతి మైదానాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్విమ్మింగ్ పూల్ పరిసరాలలో లైటింగ్‌ను మెరుగుపరచాలని సూచించారు. కృష్ణకాలనీ ఏర్పాటు చేయబోయే చిల్డ్రన్‌పార్క్ ప్రదేశాన్ని సందర్శించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతి మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మించడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, భరత్ భూషణ్, సీనియర్ పీవో రణదీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

కోల్ ఇండియాలో సింగరేణి క్రీడాకారులు ప్రతిభ చూపడం అభినందనీయమని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. 2024-25 వార్షిక క్రీడల్లో భాగంగా కోల్ ఇండియా, ఆల్ ఇండియా పబ్లిక్ సెక్టార్ టోర్నమెంట్‌లో మెడల్స్ సాధించిన శ్రీరాంపూర్ క్రీడాకారులకు యాజమాన్యం పక్షాన నగదు బహుమతులు అందించి, సన్మానం చేశారు. కార్యక్ర మంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, ఇండోర్ కెప్టెన్ తోట సురేష్, జీఎం చర్చల కమిటీ సభ్యుడు రామచందర్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు




కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెడుతున్న గుర్తింపు సంఘం నాయకులు

మందమర్రిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు చేస్తామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, కేకే 5 గని ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక కేకే 5 గనిపై కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చడాన్ని నిరసిస్తూ కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెట్టి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బొగ్గు సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. ఇప్పటికే అనేక బొగ్గు బ్లాకులను అదాని, అంబానీలకు కట్టబెట్టాలన్నారు. కార్మిక చట్టాలను మారిస్తే సహించేది లేదన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న కార్మిక సంఘాలన్ని ఒక్కటై పోరాడుతున్నాయని, జేఏసీగా ఏర్పడి కేంద్రం విధానాలపై పోరాటా కార్యక్రమాలను రూపొందించామన్నారు. లేబర్ కోడ్‌ల ప్రవేశానికి వ్యతిరేకంగా జూలై 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సంపత్, సోంశెట్టి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతతో విధులు నిర్వహించాలి

మందమర్రిటౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): సంస్థలో ఉద్యోగులు, అధికారులు బాధ్యతతో విధులు నిర్వహించాలని కార్పొరేట్ సివిల్ జీఎం సూర్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక జీఎం కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణి సంస్థలో మంచి వేతనాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా సౌకర్యాలు కూడా చాలా ఉన్నాయన్నారు. ఉద్యోగులు, అధికారుల పనితీరుపైనే సంస్థ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేసే వారికి మంచి ఆదరణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మొదటిసారిగా మందమర్రికి వచ్చిన కార్పొరేట్ సివిల్ జీఎం సూర్యనారాయణకు ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్ జ్ఞాపికను అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వెంకటరమణ, శాంతిఖని గ్రూపు ఏజెంట్ కాదిర్, పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, సేఫ్టీ అధికారి రవీందర్, సివిల్ ఎస్ఈ రాము, జయప్రకాష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కార్పొరేట్ సివిల్ జీఎం సూర్యనారాయణ



సేవా సమితి స్టాల్ సందర్శన


స్టాల్ వద్ద ప్రపంచ సుందరీమణులు

శ్రీరాంపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఇందిరా మహిళా శక్తి బజారులో ఏర్పాటు చేసిన సింగరేణి సేవా సమితి స్టాల్‌ను గురువారం ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. వివిధ ఏరియాలకు చెందిన మహిళలు తయారు చేసిన బ్యాగులు, చేతిపర్సులు, ఇతర దుస్తులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. మహిళలతో ముచ్చటించి స్వయం ఉపాధి చూపించినందుకు సింగరేణి యాజమాన్యాన్ని మెచ్చుకున్నారు. స్టాళ్లలో ఉన్న వారితో వారితో సెల్ఫీలు దిగారు.

ఆర్‌కే 7 గనిని సందర్శించిన కేంద్ర అధికారులు



గని వద్ద కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారులు

శ్రీరాంపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 7 గనిని కేంద్ర బొగ్గు గనుల శాఖ అధికారులు గురువారం సందర్శించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎండీ అఫ్తాబ్ ఆలమ్, సెక్షన్ ఆఫీసర్ విజయ్ సింగ్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ గనిలోనికి వెళ్లి బొగ్గు ఉత్పత్తి, రవాణా, రక్షణ చర్యలను సమగ్రంగా సమీక్షించారు. భూగర్భ గనుల్లో తవ్వకాలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. రక్షణ చర్యల గురించి ప్రశ్నించారు. నాణ్యమైన బొగ్గును వినియోగదారులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ కె. రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, గ్రూప్ ఇంజనీర్ రాజా రవి చరణ్, రక్షణాధికారి సంతోష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ వెలకట్టలేనిది

మందమర్రి టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అతిపెద్ద పరిశ్రమ అయిన సింగరేణి సంస్థలో భూగర్భంలోకి వెళ్లి నల్లబంగా రాన్ని పండిస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెల కట్టలేనిదని త్రిదండి చిన్నజీయర్ స్వామి తెలిపారు. గురువారం పట్టణంలోని పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ రథోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి సింగరేణి కార్మికులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్మికులు వారి ప్రాణాలను పణంగా పెట్టి సంపద సృష్టి కర్తలుగా మారారన్నారు. చీకటిని చీల్చుతూ ప్రపంచానికి వెలుగులు ఇస్తున్నారన్నారు. శ్రమతో కూడుకున్న సంపద ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. సింగరేణి కార్మికులపై తనకు అపారమైన ఇష్టం ఉందని తెలిపారు. సింగరేణి సంస్థ పది కాలాల పాటు పురోగతి సాధించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దేవేందర్ దంపతులు చిన్న జీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు.

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించండి..

సింగరేణి సీఎండీని కోరిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 22 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఏరియా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలగా మార్చి కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌ను కోరారు. గురువారం సింగరేణి భవన్‌లో సీఎండీని కలిసి ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి రామగుండం నుంచే కాకుండా బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, భూపాలపల్లి ప్రాంతాల నుంచి సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులు వైద్యం కోసం వస్తున్నారని, శాశ్వత ప్రాతిపదికన న్యూరో ఫిజిషియన్, ప్రిడియార్టిక్, కంటి, న్యూరో సర్జన్, రేడియాలజిస్టులను నియమించాలని కోరారు. 2డీ ఎకో, టీఎంటీ టెక్నిషియన్లతోపాటు గుండె వ్యాధులకు సంబంధించిన వైద్యులను నియమించాలని, ప్రస్తుతం ఉన్న డయాలసిస్ యూనిట్‌ను విస్తరించి అదనంగా మరో ఐదు పడకలను పెంచాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎండీ కార్మికుల ఆరోగ్యమే సంస్థ లక్ష్యమని, త్వరలోనే శాశ్వత ప్రాతిపదికన వైద్యులను నియమించాలని ఆయన హామి ఇచ్చారు.

వర్షంతో ఓసీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

నీరు తొలగిస్తున్న అధికారులు

మందమర్రి టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రధానంగా బెల్లంపల్లి రీజియన్‌లోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలోని ఓసీల్లో ఈ బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలుగుతుంది. ఓసీల్లో నీరు చేరడంతో అధికారులు నీటిని తొలగిస్తున్నారు. అంతే కాకుండా వర్షంతో గనులకు కూడా కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారు. రెండు రోజుల వర్ష ప్రభావం ఓసీలపై తీవ్రంగా పడింది. దీంతో పాటు గనుల్లో కూడా ప్రభావం చూపింది. ఒక్కసారిగా కురుస్తున్న వర్షాలతో ఉపరితల గనిలో గంటల తరబడి ఉత్పత్తికి అంతరాయం కలుగుతోంది. నీరు తొలగించే పనుల్లో అధికారులు నిమగ్నం అవుతున్నారు.

దారులన్నీ కాళేశ్వరం వైపే..

- ఎనిమిదో రోజు లక్ష మంది పుష్కర స్నానాలు
- బుధవారం రాత్రి కురిసిన వర్షంతో ఇబ్బందులు
- ట్రాఫిక్‌ను మళ్లించినా తప్పని తిప్పలు
- అడవిలో ఐదు కిలోమీటర్ల మేర జామ్


అన్నారం రోడ్డులో భారీగా నిలిచిన వాహనాలు

భూపాలపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. పుష్కరాలు ప్రారంభమై ఎనిమిది రోజులు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు బస్సులు, ప్రైవేటు వాహనాల్లో త్రిలింగ క్షేత్రానికి భారీగా తరలివచ్చారు. పుష్కరాలు మరో నాలుగు రోజుల్లో ముగియనుండడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పుష్కరాల్లో భాగంగా ఎనిమిదో రోజైన గురువారం దాదాపు లక్ష మంది భక్తులు సరస్వతీ నదిలో పుష్కర స్నానాలు ఆచరించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక్కసారిగా భక్తుల సంఖ్య పెరగడంతో పుష్కర ఘాట్లు జనంతో కిటకిటలాడాయి. ముక్తీశ్వరాలయంలోనూ స్వామివారి దర్శనం కోసం భక్తులకు నాలుగు గంటల సమయం పడుతోంది. బుధవారం రాత్రి కాళేశ్వరంలో కురిసిన భారీ వర్షం కారణంగా క్షేత్రమంతా నీరు నిలిచి బురదమయం కావడంతో పుష్కర ఘాట్లతోపాటు, తాత్కాలిక బస్టాండ్, పుష్కర ఘాట్లకు వెళ్లే మట్టి రోడ్లు బురదతో నిండిపోయి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్ స్థలాల్లో వర్షం కారణంగా నీరు నిలిచి వాహనాలు కూరుకుపోవడంతో వాటిని బయటకు తీసి ట్రాఫిక్‌ని క్లియర్ చేసేందుకు అధికారులు తీవ్రంగా శ్రమించారు.

కాళేశ్వరం క్షేత్ర మంతా నల్లరేగడి మట్టితో కూడిన నేల కావడంతో వర్షానికి మొత్తం బురదగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దాంతో పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు ఏడు కిలోమీటర్ల దూరంలోని అన్నారం క్రాస్ నుంచి కాళేశ్వరానికి వాహనాలను మళ్లించారు. పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు కదలకపోవడంతో దాదాపు ఐదు కిలో మీటర్ల మేర అడవిలోనే ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనాలు చిక్కుకుపోయాయి. దాంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్రేన్లు, ట్రాక్టర్లను రంగంలోకి దింపి ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వాహనాలను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారు. సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వైపు పుష్కర ఘాట్లకు సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీ మొత్తం వర్షపు నీటితో బురద మయం కావడంతో అధికారులు వెట్ మిక్స్ చల్లి బురదను నియంత్రించే ప్రయత్నం చేశారు. వర్షం కారణంగా కూలిపోయిన టెంట్లను తిరిగి పున రుద్ధరించారు. చివరి మూడు రోజుల్లో భక్తులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. కలెక్టర్ రాహుల్‌శర్మ కాళేశ్వరంలో ద్విచక్ర వాహనం పై తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతీ పుష్కరాల్లో ఎనిమిదో రోజు గురువారం నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యుడు సూర్యనారాయణ, ఆర్మూర్ శాసనసభ్యుడు పైడి రాకేష్‌రెడ్డి, వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యుడు గడుగు గంగాధర్, సినీ నటుడు అల్లు అర్జున్ తల్లి అల్లు నిర్మల తదితరులు స్నానాలు చేశారు.


స్నానాలాచరిస్తున్న భక్తులు


నదిలో దీపాలను వదులుతున్న మహిళలు


ఎడ్లబండ్లపై వెళుతున్న భక్తులు

రైతుల ఖాతాల్లో రూ.174 కోట్లు జమ

మంచిర్యాల కలెక్టరేట్, మే22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతు వద్ద నుంచి వరి ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 345 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 318 కేంద్రాల ద్వారా 18,978 మంది రైతుల వద్ద నుంచి లక్షా 41వేల 266 టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో 174కోట్ల 11 లక్షలు జమ చేశామన్నారు. నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసిన 107 కొనుగోలు కేంద్రాలను మూసి వేశామన్నారు. సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు.

రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా రైతులకు తాగునీరు, నీడ, ఓఆర్ఎస్, గోనే సంచులు, టార్పాలిన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

తుది జాబితాను ప్రభుత్వానికి అందజేశారు. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500 వంట గ్యాస్ సబ్సిడీ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయి. కాగా ప్రకటించిన వాటిలో మిగతా పథకాలు ప్రారంభం కాలేదు.

● లక్షల్లో దరఖాస్తులు..

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా వివిధ పథకాలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా లక్షల్లో దరఖాస్తులు అందగా, అర్హతగల వాటిని అధికారులు ఆమోదించారు. కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు అంగవైకల్యం కింద మొత్తం 6591 దరఖాస్తులను అధికారులు ఆమోదించారు. అలాగే ఇతర విభాగాలకు చెందిన పింఛన్ల కోసం 50,467 దరఖాస్తులు అర్హత సాధించాయి. అంగవైకల్యం కింద జిల్లాలోని అర్హులకు పింఛన్లు అందజేసేందుకు నెలకు రూ. 3 కోట్ల 95లక్షల 46వేలు అవసరం కాగా ఇతర విభాగాల వారికి పింఛన్లు మంజూరు చేసేందుకు నెలకు రూ. రూ 20 కోట్ల 18 లక్షల 68 వేలు అవసరం అవుతాయి. ఈ మొత్తాన్ని ప్రభుత్వం లబ్దిదారులకు అందజేయాల్సి ఉండగా, కేవలం ఓల్డ్ ఏజ్ పింఛన్లు మాత్రం అమలుకు నోచుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా కొత్తగా భర్త చనిపోయిన స్త్రీలు 2,891 మందికి పింఛన్లు సక్రమంగా అందుతున్నాయి. ఇదిలా ఉండగా గృహిణులకు రూ. 2500 పథకం కింద 2,10,614 దరఖాస్తులు రాగా పథకం అమలుకు నోచుకోలేదు. అలాగే కౌలు రైతులకు రూ. 12,000 పథకం కింద 1,06,365, ఉద్యమకారులకు 323 చదరపు గజాల ఇంటి స్థలం పథకం కింద 2534 దరఖాస్తులు వచ్చాయి. వాటికి ఏడాదిన్నర గడిచినా మోక్షం లభించడంలేదు.

రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి

కాసిపేట, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ ముత్యంపల్లి రైతు వేదిక వద్ద ఫార్మర్ రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి వ్యక్తికి ఆధార్‌కార్డు ఎంత అవసరమో రైతుకు కూడ ఈ రైతు గుర్తింపుకార్డు అదే విధంగా పని చేస్తుందన్నారు. రైతు గుర్తింపు కార్డు లేకుంటే ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పీఎం కిసాన్ సబ్సిడీపై ఇస్తున్న ఎరువులు, పురుగుమందులు పంట దిగుబడి కొనుగోళ్లకు మద్దతు ధర, పంట రుణాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరికావున ప్రతి రైతు కూడ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 31లో రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న రైతులందరూ పట్టాదారు పుస్తకంతో పాటు రైతు ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ అందుబాటులో ఉండాలని సూచించారు.

పాపం..పండుటాకులు

ఆధార్‌కేంద్రం వద్ద అవస్థలు


ఆధార్ సెంటర్ వద్ద వృద్ధులు

కాసిపేట, మే22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆధార్‌కేంద్రం వద్ద ప్రజల అవస్థలు తప్పడం లేదు. ఆధార్ సెంటర్‌లో పేర్లు నమోదు చేసుకోవాలంటే వారం రోజుల పాటు తిరగాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రేష న్‌కా ర్డుల జాబితా కోసం ఆధార్ తప్పనిసరైంది. దీంతో ఆధార్‌లో పేర్లు నమోదు చేసుకునేందుకు ఆధార్ నిర్వహణ సరిగ్గాలేకపోవడం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుండ్లపాడుకు చెందిన మడా విభీము, అమ్ము బాయిలు వారం రోజులుగా ఆధార్‌కేంద్రం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. వేలు ముద్ర రావడం లేదని తిరిగి పంపించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చెట్టు కొమ్మ పడి మహిళ మృతి

జన్నారం, మే22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహ్మదాబాద్ అటవీప్రాంతంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులపై చెట్టుకొమ్మ పడడంతో తీవ్ర గాయాలై ఓ మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే బుధవారం దండపల్లి మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన శనిగారపు జగన్, అతడి భార్య సునీత (37) ద్విచక్రవాహనంపై నిర్మల్ జిల్లా కడెం మండలంలోని లింగాపూర్ గ్రామంలో పెళ్లికి వెళ్లి తిరుగుపయనమయ్యారు. బుధవారం రాత్రి మహ్మదాబాద్ అటవీప్రాంతంలోకి వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా గాలివాన కురిసింది. దీంతో రోడ్డుపక్కనే ఉన్న చెట్టు కొమ్మలు విరిగి మీద పడడంతో సునీత తలకు తీవ్ర గాయమైంది. భర్త జగన్ కాలుకు గాయాలయ్యాయి. అటుగా వచ్చిన పలువురు గమనించి ఆటోలో లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సునీత మృతి చెందింది. భర్త జగన్‌కు తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సునీత తండ్రి సెవులమద్ది శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, మే22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో తిరుపతి రెడ్డి తెలిపారు. మండలంలోని ముల్కల్ల జడ్పీ హై స్కూల్‌లో జరుగుతున్న ప్రైమరీ లెవల్ టీచర్ ట్రైనింగ్ కేంద్రాన్ని గురువారం ఎంఈవో సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు


నస్పూర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హారతి ఇస్తున్న పూజారి


మేదరిపేట హనుమాన్ మందిరంలో హనుమాన్ చాలీసా పారాయణం

నస్పూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నస్పూర్ పట్టణంలోని అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల ఆయా ఆలయాలకు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించారు. నస్పూర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు తరలివచ్చారు. హనుమాన్ స్వామి దర్శించారు. హనుమాన్ మాల ధరించి దీక్ష స్వీకరించిన స్వాములు కొండగట్టు అంజన్న దర్శనం, మాల విరమణ కోసం ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ప్రధానార్చకులు ఫణి కుమార్ శర్మ తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

బెల్లంపల్లి: పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహన ర్యాలీలు నిర్వహించారు. దేవాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చెన్నూరు: చెన్నూరు పట్టణంలో, మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని పంచముఖి, ప్రతాప మారుతి, బడాహనుమాన్, చోటా హనుమాన్, అయ్యప్ప స్వామి ఆలయాల్లో హనుమాన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని ఆస్నాద, ఓత్కులపల్లి, కిష్టంపేట గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ఆంజనేయ స్వామికి అభిషేకాలు, పూజలు చేశారు. మహిళలు మంగళహారతులతో తరలి వచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దండేపల్లి: మండలంలోని మేదరిపేట, గూడెంతో పాటు పలు గ్రామాలోని అంజనేయస్వామికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మేదరిపేటలో హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ భక్తులు అజనేయ స్వామికి ప్రత్యేక ఆలంకరణ చేశారు.

జన్నారం: మండలంలోని అన్ని గామాల్లో గల హనుమాన్ మందిరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలతో పాటు మండలంలోని జన్నారం, పొన్కల్, పైడిపల్లి, ఇందన్‌పల్లిలోని పలు ఆలయాల్లో శ్రీరామ యాగాలను నిర్వహించారు. అనంతం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి


కొనుగోలు కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్

జన్నారం, మే22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచకుండా వెంటనే కొనుగోలు జరిపి పంపివేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఉంచవద్దని రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండాలన్నారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అటు వ్యవసాయశాఖ సూచనలు చేయాలని ఏవో సంగీత సూచించారు. వారి వెంట తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముజాఫర్ అలీ, ఫసీ ఉల్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణతో పాటు మామిడిపల్లి ఇందయ్య, సిబ్బంది అధికారులు ఉన్నారు.

ఏసీపీ, సీఐకి ఘన వీడ్కోలు


ఏసీపీని సన్మానిస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, మే22 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషనరేట్ స్పెషల్ బ్రాంచి విభాగంలో ఏసీపీగా సేవలు అందించిన రాఘవేంద్రరావు, ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహించిన ప్రేంకుమార్‌లు బదిలీపై వెళ్లగా వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. సీపీ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ ఏసీపీ, సీఐలు విధులపట్ల అంకితభావంతో వారు చేసిన సేవలను ఆయన అభినందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఏవో శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు కుటుంబాలకు బాసట


గంధం మహేష్‌కు ఉద్యోగ కారుణ్య నియామక పత్రం అందిస్తున్న ఎస్టీపీపీ అధికారులు

జైపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో చేపట్టిన కారుణ్య నియామకాలు ఎన్నో కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నాయని ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి పేర్కొన్నారు. గురువారం ఎస్టీపీపీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న గంధం వెంకటి అనారోగ్యం కారణంగా మెడికల్ ఇన్వాడిడేట్ కాగా అతని కుమారుడు గంధం మహేష్‌కు జీఎం శ్రీనివాసులుతో కలిసి కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో రకరకాల అనారోగ్య కారణాలతో పనులు చేయలేని కార్మికులకు మెడికల్ బోర్డు ద్వారా వారిని పరీక్షించి మెడికల్ ఇన్వాలిడేట్ అయితే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ఇస్తూ వారి కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామన్నారు. సింగరేణిలో ఉద్యోగం రావడం మంచి అవకాశమని, ఉద్యోగాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు మురళీధర్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ బ్రాంచ్ ప్రెసిడెంట్ సముద్రాల శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ ఆజ్మీర తుకారాం, సత్యనారాయణరెడ్డి, పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి


గొల్లపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో హరికృష్ణ

నెన్నెల, మే 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలు కురుస్తుండటం, మరో రెండు రోజులు వర్ష సూచన ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ సూచించారు. కల్లాల్లోని ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండలంలోని గొల్లపల్లిలో బుధవారం రాత్రి కురిసిన భారి వర్షానికి దెబ్బతిన్న పొలాలు, కల్లాల్లోని ధాన్యం కుప్పలను గురువారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. కల్లాల్లోని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. అవసరమైన గన్నీ బ్యాగులు పంపిస్తామని చెప్పారు. జోగాపూర్, మైలారం సెంటర్ల నిర్వాహకులు సర్దుబాటు చేసుకొని గొల్లపల్లి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం సర్వే పూర్తిచేసి, వివరాలు ప్రభుత్వానికి నివేదించారని, నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.

మందమర్రిలో ముమ్మరంగా డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

మందమర్రి టౌన్, మే 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌తో పాటు పలు కల్వర్టుల వద్ద బెల్లంపల్లికి చెందిన డాగ్ స్క్వాడ్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఈ తనిఖీలు చేపడుతున్నారు. శునకాలతో పెద్ద ఎత్తున ప్రధాన కూడళ్లలో ఉన్న షెల్టర్లలో తనిఖీలు కొనసాగుతున్నాయి. పై అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు.


మందమర్రిలో తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్

నీటి కోసం ఇబ్బందులు

దహెగాం, మే 22 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం రాంపూర్ గ్రామంలో నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. అకాల వర్షంతో దహెగాం మండలానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గెర్రె సమీపంలోని పంపు ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. సమీపంలోని పెద్దవాగులో నీటిని ఎడ్లబండ్లతో డ్రమ్ముల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నామని ప్రజలు పేర్కొంటున్నారు.

మండల సమాఖ్య కార్యవర్గం

వాంకిడి, మే 22(ఆంధ్రజ్యోతి): వాంకిడి వేంకటేశ్వర మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఆదె స్వరూప ఎన్నికైనట్లు డీపీఎం అన్నాజీ తెలిపారు. గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో వేంకటేశ్వర మండల సమాఖ్య ఎన్నికలను నిర్వహించినట్లు తెలిపారు. అధ్యక్షురాలిగా ఆదె స్వరూప, కార్యదర్శిగా తార, కోశాధికారిగా వినోదను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మహేష్, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యవర్గంను గురువారం మండల సమాఖ్య కార్యాలయంలో ఓటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా ఆత్రం బొజ్జుబాయి, కార్యదర్శిగా టేకం రాధ, కోశాధికారిగా తానుబాయి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం జగదీష్, సీసీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చింతలమానేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్బా ఎక్స్‌రోడ్డు గ్రామానికి చెందిన లెండుగురె వసంత్ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. అతడి దహన సంస్కారాలు నిర్వహణకు వారి వద్ద నగదు లేక పోవడంతో విషయం తెలుసుకున్న గొర్లె శ్రీనివాస్ 6,500 రూపాయల నగదును బాధిత కుటుంబానికి అందజేసి మానవత్వం చాటారు. కార్యక్రమంలో ఏఎస్సై రాథోడ్ మను, సాయికిరణ్, నాగరాజు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, డీఈవో యాదయ్యకు జిల్లా కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేసిన స్కావెంజర్లకు కేవలం మూడు నెలల జీతాలు మాత్రమే చెల్లించారన్నారు. మిగిలిన నెలల వేతనాలు చెల్లించాలని, సమ్మర్ క్యాంపునకు సంబంధించి రెన్యూ మరేషన్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి

ఆలయ వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆరో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీరాములు ఆధ్వర్యంలో అఖండ దీపారాధన, పుణ్యావచనము, నవగ్రహ, నక్షత్ర పూజ, హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేష్, తిరుపతి, వరప్రసాద్, వెంకటయ్య, మహేష్, గోపి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.



వానాకాలం సాగుకు సన్నద్ధం

- గ్రామాల్లో దుక్కులను సిద్ధం చేస్తున్న రైతులు
- జూన్ ప్రారంభం నుంచే పంటలు వేసేందుకు ఏర్పాట్లు
- పత్తి, వరి, సోయా, కంది, మొక్కజొన్న సాగుకు రైతుల మొగ్గు
- ఏర్పాట్లలో నిమగ్నమైన వ్యవసాయ అధికారులు

చింతలమానేపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సాగు కోసం రైతులు సన్నద్ధం అవుతున్నారు. విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుంటూనే పంటలు వేసేందుకు దుక్కులను సిద్ధం చేసుకుంటున్నారు. నల్లమట్టి వేయడంతో పాటు జూన్ ఆరంభంలో వర్షాలు పడగానే విత్తనాలు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లాలో పత్తి, వరి, సోయా, కంది, మొక్కజొన్న పంటలతో పాటు ఆరుతడి పంటలు వేసేందుకు విత్తనాలు సమకూర్చుకుంటున్నారు. యాసంగి సాగు ముగియడంతో రైతులంతా వానాకాలం పంటల సాగుపైనే దృష్టి పెట్టి భూములను చదును చేస్తున్నారు. పశువుల ఎరువులను, నల్ల మట్టిని వేసి పంటలకు అనువుగా తయారు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తుండగా అధికారులు మాత్రం తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. నాసిరకం విత్తనాలు అమ్మకుండా చూడడంతో పాటు, గుర్తింపుపొందిన విత్తనాలు కొనుగోలు చేసేలా రైతులకు రశీదులు ఇవ్వాలని డీలర్లకు ఆదేశాలు ఇస్తున్నారు. ఇప్పటికే పలు మండలాల్లోని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడాలని ఆదేశించారు.

విత్తనాలు కొనుగోలు చేస్తున్నరైతులు..

రైతులు పత్తి, వరి, ఇతర వివిధ రకాల పంటల సాగు కోసం అవసరమైన విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలకు ఎలాంటి ఇబ్బందిలేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వరికి సంబంధించి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న, ఇతర విత్తనాలు మాత్రం ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేసే అవకాశం ఉన్నది. ఇప్పటికే పలు షాపుల్లో విత్తనాలను డీలర్లు అందుబాటులో ఉంచారు. వానాకాలం పంటలకు సమయం దగ్గర పడుతుండడంతో వ్యవసాయశాఖ ఆ యా మండలాల్లో విత్తనాల అమ్మకాలపై దృష్టి పెట్టారు. నాసిరకం విత్తనాలు అమ్మకుండా తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

వివిధ పంటల సాగు అంచనా..

పంట	ఎకరాలు
పత్తి	3,35,363
వరి	56,861
కంది	30,430
మొక్కజొన్న	1000

కావాలసిన ఎరువులు

ఎరువు	మెట్రిక్ టన్నులు
యూరియా	60,081
డీఏపీ	40,054
ఎంవోపీ	10,013

సాగు అంచనా 4,45,049 ఎకరాలు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 4,45,049 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో అధిక శాతం మంది పత్తినే సాగుచేయనున్నట్లు భావిస్తున్నారు. ఈ మేరకు 6.70 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం కంటే పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు లెక్కలు వేశారు. పత్తి 3,35,363 ఎకరాలు, వరి 56,861 ఎకరాలు, కంది 30,430 ఎకరాలు, మొక్కజొన్న 1000 ఎకరాలు, జొన్న, పెసరా, మినుములు, సోయాబీన్, మిరప, వేరుశనగ, ఆముదాలు, నువ్వులు 21,395 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నదని అధికారులు అంచనాలు రూపొందించారు. వీటికి అవసరమైన యూరియా 60,081 మెట్రిక్ టన్నులు, డీఏపీ 40,054 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ(మ్యూరియేట్ ఆఫ్ పొటాషియం) 10,013 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌సీ 20,027 మెట్రిక్ టన్నులు, జిల్లాకు కావాల్సిన ఇతర ఎరువులు అందుబాటులో ఉంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రశీదులు తీసుకోవాలంటున్న అధికారులు..

విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదులను రైతులు తప్పనిసరిగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. విత్తనాలు వేయడం వల్ల పంటలు దెబ్బతింటే రశీదులను బట్టి పరిహారం పొందే అవకాశం ఉంటుందని వారు సూచిస్తున్నారు. వీటిపై అధికారులు తనిఖీలు కొనసాగించడంతో పాటు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి మరిన్ని తనిఖీలు చేసేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. జూన్‌లో వర్షాలు కురిసిన వెంటనే రైతులు విత్తనాలు విత్తేందుకు సిద్ధం అవుతున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి


డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపల్ కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని డిప్యూటీ కమిషనర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు రాజేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీ మున్సిపల్‌గా ఏర్పడి 15 నెలలు అవుతున్నా కార్మికులకు గ్రామపంచాయతీ వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. నాయకులు సుధాకర్, రాజయయ, సమ్మయ్య, శ్రీకాంత్, శంకర్, నగేష్ ఉన్నారు.

అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు బదిలీ

ఆసిఫాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులను వెలువరిచింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వహిస్తున్న ఆర్.ప్రభాకర్‌రావును వరంగల్ అదనపు డీసీపీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): హను మాన్ జయంతి వేడుకలను గురువారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శిరీష్ శర్మ గణపతిపూజ, స్వస్తీ పుణ్యహవచనము, నవగ్రహారాధన, రుద్రాభిషేకం, ఫల, పత్ర, పుష్పార్చ న, మంగళహరతి, మహా మంత్ర పుష్పం, మహాదాశీ ర్వచనము, తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం మహా అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్, బాలేష్‌గౌడ్, మల్లేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆల య కమిటీ సభ్యులు వెంకన్న, వివేక్, రమేష్, శ్రీనివాస్, బాబుగౌడ్, జీవన్, సుధాకర్, గణపతి, లక్ష్మణమూర్తి, నారాయణమూర్తి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవలక్ష్మి, కుటుంబ సభ్యులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం: డీసీవో


దహెగాంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో రాథోడ్ బిక్కు

దహెగాం, మే 22 (ఆంధ్రజ్యోతి): రైతులు అధైర్య పడొద్దని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని డీసీవో రాథోడ్ బిక్కు రైతులకు భరోసా ఇచ్చారు. దహెగం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీవో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఒక్క రూపాయి నష్టం జరగకుండా చూస్తామన్నారు. రైతులకు సరిపడా టార్పాలీన్లు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యం తడిసి పోకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఆర్ శామ్యూల్, పీఏసీఎస్ కార్యదర్శి నారాయణ, ఏఈవోలు వంశీ, పీపీసీ ఇన్‌చార్జి జీవన్ తదితరులు ఉన్నారు.

పెంచికలపేట: మండలంలోని ఎల్కపల్లి, ఎల్లూరు, గొంట్లపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఏపీఎం కోనయ్య, ఏఈఓ శ్రీవిద్య ఉన్నారు.

రైతులు ధాన్యాన్ని తీసుకురావద్దు

సిర్పూర్(టి), మే 22(ఆంధ్రజ్యోతి): మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా బంద్ చేయాలని, రైతులు ధాన్యానిన తీసుకురావద్దని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. గురువారం మండలంలోని టోంకిని, పారిగాం, లోనవెల్లి, సిర్పూర్(టి) కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యంను తీసుకురావద్దన్నారు. తదుపరి ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను తెరవద్దన్నారు. ఏవో గిరీష్‌కుమార్, ఏపీఎం దుర్గయ్య, ఏఈవోలు నేహాతబసుం, రవికుమార్, రెవెన్యూ సిబ్బంది గోపాల్ తదితరులు ఉన్నారు.

అకాల వర్షం.. అన్నదాతల ఆందోళన


జైనూరులో కురుస్తున్న వర్షం


దహెగాంలో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు

దహెగాం, మే 22 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. అధికారుల అలసత్వం, రైస్ మిల్లుల కేటాయింపు, కొనుగోలు చేసిన ధాన్యం తరలింపు ఆలస్యం కావడం రైతులకు శాపంగా మారింది. బుధవారం మధ్యాహ్నం, గురువారం సాయంత్రం దహెగాం మండల వ్యాప్తంగా భారీ వర్షం కురియడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరబోసిన ధాన్యం, ధాన్యం నింపిన సంచులు కాపాడుకోవడానికి టార్పాలిన్లు కప్పినా గాలి దుమారానికి లేచిపోవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

చింతలమానేపల్లి/బెజ్జూరు/జైనూర్: చింతలమానేపల్లి, బెజ్జూరు, జైనూర్ మండలాల్లో గురువారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా సాయంత్రం వేళల్లో వర్షం కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. జైనూర్ వారసంతకు వచ్చి ప్రజలు కొనుగోలు చేసిన నిత్యావసర సరకులు తడిపి పోవడంతో ఇబ్బందులు పడ్డారు. లొద్దిగూడ గ్రామ ప్రజలు బురద రోడ్డుపై కాలినడకన రాకపోకలు చేస్తు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

శిక్షణ తరగతులను పరిశీలించిన ప్రత్యేక అధికారి


శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్ టౌన్ మే 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు, కాగజ్‌నగర్‌లోని స్థానిక ఓల్డ్ హైస్కూల్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాలను ప్రత్యేకాధికారి, అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి గురువారం సందర్శించారు. ఈ శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులతో చర్చించి బోధనా విధానాల్లో అభివృద్ధి చేయాల్సిన అంశాలపై చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి తగిన మార్గదర్శనంతో బోధించాలన్నారు. తరగతి గదులు ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని, ఇంటరాక్టివ్ ప్యానెల్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత బోధన వేదికలను ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి మరింత బలోపేతం చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠ్య పుస్తకాల గోదాంను పరిశీలించి సకాలంలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, జిల్లా అకాడమి మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ఎంఈవో కోర్సు డైరెక్టర్ వాసాల ప్రభాకర్, జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఆబిద్ అలీ, శిక్షకులు రమేష్, ఆర్పీలు అనురాధబాయ్, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఉపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న పాఠాలను పాఠశాలల పునఃప్రారంభం తరువాత విద్యార్థులకు గుణాత్మక విద్యను బోధించాలని ఎంఈవో వేణుగోపాల్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను ఆయన గురువారం పరిశీలించారు. ఆర్పీలు ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు బోధించాలన్నారు. ఆయన వెంట ఆర్పీలు, సీఆర్పీలు పవన్‌కుమార్, రాకేష్ తదితరులు ఉన్నారు.

మహనీయుల చరిత్రను భావితరాలకు అందించాలి


నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అధికారులు, నాయకులు

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): మహనీయుల చరిత్రను, వారి త్యాగాలను భావితరాలకు అందించాల ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు సీవన్, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ హాజరై భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల శ్రేయస్సు కోసం కృషి చేసిన దీనజన బాంధవుడు భాగ్యరెడ్డివర్మ అని అన్నారు. దళిత ఉద్యమ పితామహుడు, సంఘ సంస్క ర్త, దళిత వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ అని, సమాజంలో దళితుల చైతన్యం కోసం విశేష కృషిచేసిన మహనీయుడని అన్నారు. దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమం కోసం ఉద్యమించిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- భాగ్యరెడ్డి వర్మ గొప్ప సంఘ సంస్కర్త

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ అసలు పేరు మ్యాదరి భాగయ్య అని ఎన్నో పోరాటాల ఫలితంగా వర్మ అనే బిరుదు వచ్చిందని అన్నారు. సమాజంలో అందరు సమానమే అని, సమసమజాన నిర్మాణం కోసం పోరాటం చేశారని అన్నారు. అణగారిన, దళితుల అభివృద్ధికి విద్యా సంస్థలు నెలకొల్పి వారి జీవితాల్లో విద్యతో వెలుగులు నింపారని కొనియాడారు. జగన్ మిత్ర మండలిని స్థాపించి దళితుల చైతన్యం కోసం పాటు పడ్డారని అన్నారు. దేవదాసి, జోగిని వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపి వారి కోసం కృషి చేశారని అన్నారు. వారి జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీపీవో ఏవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంటీవో ఆర్ఐ అంజ న్న, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్సై లావణ్య, ఆర్ఎస్సై రాజేష్, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ

వాంకిడి: భాగ్యరెడ్డి వర్మను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మౌల్కర్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో భాగ్య రెడ్డివర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు శ్యాంరావు, రోషన్, లాహుజీ, బలవంత్, మహేష్, మారుతి, శివాజీ, సంతోష్, నూతన్, రమేష్, యోగు, అన్నారావు, లడ్డు తదితరులు పాల్గొన్నారు.